సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
ఆదివారం । 18 । జూన్ । 2023



విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు
విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో చంద్రశేఖరరావు హెచ్చరించారు. 8లో



కుటీర పరిశ్రమలతో జీవనోపాధి
ఎంఈజీపి పథకం ద్వారా పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. 8లో



ఉష్ణ తాపం నుంచి ఉపశమనం
పాడేరు పరిసర మండలాల్లో శనివారం సాయంత్రం కురిసిన వర్షంతో వేసవి తాపం నుంచి ఉపశమనం లభించింది. 8లో

విద్యతోనే సమాజ సమగ్రాభివృద్ధి

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- టెన్త్, ఇంటర్ ప్రతిభావంతులకు 'ఆణిముత్యాలు'తో సత్కారం



ప్రశంసా పత్రాలు, నగదు పురస్కారాలు పొందిన విద్యార్థులతో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్, ఎంపీ మాధవి, ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, పాల్గుణ, ట్రైకార్ చైర్మన్ బుల్లిబాబు

సాక్షి,పాడేరు: విద్యతోనే సమాజం అన్ని రంగాల్లో సమ సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. శనివారం పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అధ్యక్షతన జగనన్న అణిముత్యాలు కార్యక్రమాన్ని స్థానిక కాఫీ అతిథి గృహంలో నిర్వహించారు. 2022-23 విద్యా సంవత్సరంలో టెన్త్, ఇంటర్ పరీక్షల్లో జిల్లాలో ప్రతిభ చూపిన విద్యార్థులను సత్కరించారు. ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహక నగదు, ప్రశంసా పత్రాలను కలెక్టర్ సుమిత్‌కుమార్, అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, పాడేరు,అరకు ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, పాల్గుణ,ఐటీడీఏ పీవో అభిషేక్, ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యమిస్తోందన్నారుఅన్ని ప్రభుత్వ విద్యా సంస్థల్లో కార్పొరేట్ స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించి, నాణ్యమైన విద్యను అందిస్తుందన్నారు. విద్యతోనే గిరిజన ప్రాంతం రూపురేఖలు మారుతాయన్నారు. హర్యానాలో తన చెల్లి టెన్త్ పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో 10వ ర్యాంకు సాధిస్తే మీడియా,పత్రిక సంస్థలు ఇంటికి వచ్చాయని, మా తల్లిదండ్రులకు ఎంతో గౌరవం పెరిగిందన్నారు. ఐటీడీఏ పీవో వి.అభిషేక్ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అమలుజేస్తున్న సంస్కరణలు మంచి ఫలితాలు ఇస్తున్నాయన్నారు.

ఉన్నత లక్ష్యం అవసరం: ఎంపీ మాధవి

జిల్లాలోని గిరిపుత్రులంతా ఉన్నత లక్ష్యాలను నిర్మించుకోవాలని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి కోరారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనుల ప్రాథమిక, ఉన్నత విద్యను ఎంతో ప్రోత్సహిస్తున్నారని, గిరిజన అభ్యర్థులు కూడా ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉన్నత స్థానాల్లో నిలవాలన్నారు.గత పాలకుల హయాంలో ప్రభుత్వ విద్యాలయాలు అధ్వానంగా ఉండేవన్నారు. వీటిని నాడు-నేడు పథకంలో పూర్తి స్థాయిలో సీఎం అభివృద్ధి చేశారన్నారు.

నాడు-నేడు వరం: ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రభుత్వ విద్య పొందేందుకు పోటీ అధికమైందని,నాడు-నేడు పాఠశాలల అభివృద్ధి, జగనన్న విద్యాకానుక, విద్యా దీవెన, వసతి దీవెన తదితర పథకాలన్నీ పేదలకు వరంలా మారాయని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. ప్రతీ విద్యార్థి వైద్యం, ఇంజనీరింగ్, సివిల్స్ రంగాల్లో రాణించాలని సూచించారు.

ఉపాధ్యాయుల చేతుల్లోనే భవిష్యత్తు: ఎమ్మెల్యే పాల్గుణ

విద్యార్థుల ఉన్నత భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని, వారిని ఉన్నతంగా తీర్చిదిద్దాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ కోరారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నారని, టెన్త్, ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను సత్కరించి, నగదు ప్రోత్సాహకాలు అందించడం శుభ పరిణామమన్నారు. రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొయ్యూరు ఎంపీపీ బడుగు రమేష్, పెదబయలు జెడ్పీటీసీ కూడా బొంజుబాబు, గిరిజన సంక్షేమశాఖ డీడీ కొండలరావు, ఇన్‌చార్జి డీఈవో అప్పారావు, ఎంఈవో సరస్వతి, ఏటీడబ్ల్యూవో రజని, పాడేరు సర్పంచ్ కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏకలవ్య విద్యార్థి మనోహర్‌కు అరుదైన ఘనత

గూడెంకొత్తవీధి: గూడెంకొత్తవీధి ఏకలవ్య పాఠశాలకు చెందిన మనోహర్ అనే విద్యార్థికి అరుదైన ఘనత దక్కింది. ఇంటర్‌లో జిల్లా స్థాయిలో లెక్కల్లో అత్యధిక మార్కులు సాధించినందుకు గాను గుర్తించిన జిల్లా అధికారులు జగనన్న ఆణిముత్యాలు ప్రోత్సాహానికి ఎంపిక చేశారు. శనివారం పాడేరు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అరకు ఎంపీ మాధవి, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, కలెక్టర్ సుమిత్‌కుమార్ చేతులమీదుగా విద్యార్థి కుటుంబ సభ్యులకు రూ.50వేల చెక్కును అందించారు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థికి అవార్డు రావడంపై ప్రిన్సిపాల్ రమణారావు హర్షం వ్యక్తం చేశారు.

ప్రతిభావంతులకు...

జగనన్న ఆణిముత్యాలు పథకంలో ప్రతిభావంతలకు నగదు పురస్కారాలు అందజేసి సత్కరించారు. దీనిలో టెన్త్‌లో మొదటి 5గురు టాపర్లకు రూ.50 వేల చొప్పున, నలుగురు విద్యార్థులకు ద్వితీయ బహుమతి కింద రూ.40వేలు.తృతీయ బహుమతిగా నలుగురికి రూ.30వేల చొప్పున అందజేశారు. ఇంటర్‌కు సంబంధించి జిల్లాలో 12 మంది టాపర్లకు రూ.50 వేల చొప్పున నగదు బహుమతులు పంపిణీ చేశారు.

న్యూస్‌రీల్

గృహ నిర్మాణాలు వేగవంతం

- హౌసింగ్ పీడీ బాబు



సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ బాబు

చింతపల్లి రూరల్: ప్రభుత్వం మంజూరు చేస్తున్న పక్కా గృహాల నిర్మాణాలను వేగవంతం చేయాలని గృహ నిర్మాణ శాఖ పీడీ బాబు సూచించారు. శనివారం ఆయన స్థానిక గృహ నిర్మాణ శాఖ కార్యాలయాన్ని సందర్శించారు. మండలంలో చేపట్టిన నిర్మాణ పనులు వాటి స్థితిగతులను సంబంధిత అధికారుల నుంచి తెలుసుకున్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనులు వేగవంతం చేయాలని సూచించారు. అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ పి.సాయిప్రసాద్, వర్క్ ఇన్‌స్పెక్టరుట్ల రమణ, రాజారావు పాల్గొన్నారు.

అన్నవరం ఎస్‌ఐకు ప్రత్యేక రివార్డు



ఎస్పీ తూహిన్‌సిన్హా చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న ఎస్‌ఐ రమణ

చింతపల్లిరూరల్: చిత్తశుద్ధితో విధులు నిర్వహిస్తున్న అన్నవరం ఎస్‌ఐ రమణకు ఎస్పీ తూహిన్‌సిన్హా శుక్రవారం జిల్లా కేంద్రంలో ప్రత్యేక రివార్డు, ప్రశంసా పత్రం అందజేశారు. అనుమానాస్పద మృతి కేసు ఛేదించడం, గంజాయి ముఠాను చాకచక్యంగా పట్టుకున్న సందర్భంగా ఎస్పీ ఆయనను అభినందించారు. ఆయనకు ప్రశంసాపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్ శివకిషోర్, పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

విధిగా గర్భిణులు, బాలింతల వివరాల నమోదు



సూచనలిస్తున్న ఆర్‌జేడీ చిన్మయిదేవి

కొయ్యూరు: అంగన్‌వాడీ కార్యకర్తలు విధిగా ప్రతీనెలా గర్భిణులు, బాలింతల వివరాలను నమోదు చేయాలని మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆర్‌జేడీ చిన్మయిదేవి ఆదేశించారు. శనివారం ఆమె నడింపాలెం,రావణాపల్లి అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. అనంతరం సీడీపీవో కార్యాలయాన్ని సందర్శించారు.అంగన్‌వాడీ వర్కర్లను ఉద్దేశించి మాట్లాడారు. చిన్నారులకు బోధన చేయడమే కాకుండా వారికి ఆట పాటలతో ఆహ్లాదకర వాతావరణం కల్పించాలని సూచించారు.రికార్డులను పరిశీలించారు.కోడిగుడ్లు చిన్నవిగా ఉంటే తిరిగి పంపించాలని ఆదేశించారు.ప్రతీరోజు పాలు, గుడ్డు విధిగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ఇవ్వాలని సూచించారు. సీడీపీవో విజయకుమారి,సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సీలేరులో 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

సీలేరు: సీలేరులో భానుడు ఠారెత్తిస్తున్నాడు. శనివారం 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయింది. ఉదయం 9 నుంచి సాయంత్రం ఐదు గంటలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం వల్ల బ్యాంక్, జెన్‌కో, సచివాలయం, పెట్రోల్ సేవలు నిలిచిపోయాయి. సీలేరు నుంచి జలవిద్యుత్‌కేంద్రం వరకు ఓఎఫ్‌సీ కేబుల్ విద్యుత్ స్తంభాలపై ఏర్పాటు చేస్తుండడంతో సరఫరా నిలిపివేశారు.

కాఫీ రైతులకు శుభవార్త

- మ్యాక్స్ సొసైటీ రైతులకు రూ.52.97 లక్షల బోనస్



ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు రూరల్: చింతపల్లి ఎకో పల్పింగ్ యూనిట్‌కు కాఫీ పండ్లను సరఫరా చేసిన రైతులకు పాడేరు ఐటీడీఏ తీపి కబురు అందించింది. ఈ విషయంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ కృషి ఫలించింది. కలెక్టర్ ఆధ్వర్యంలోని 13.25 మెట్రిక్ టన్నుల కాఫీని బహిరంగంగా వేలం నిర్వహించగా, కాఫీ రైతులకు లాభాలు వచ్చాయని ఆయన వెల్లడించారు. చింతపల్లి మ్యాక్స్ సొసైటీకి కాఫీ పండ్లు సరఫరా చేసిన రైతులకు రూ.52.97 లక్షల బోనస్‌గా అందిస్తామని పీవో పేర్కొన్నారు. చింతపల్లి మ్యాక్స్ సొసైటీకి 14 మండలాల్లో 38 పంచాయతీలకు చెందిన 4,747 మంది కాఫీ రైతులు 662.123 మెట్రిక్ టన్నుల కాఫీ పండ్లను సరఫరా చేశారని ఆయన పేర్కొన్నారు. పండ్లు సరఫరా చేసిన సమయంలో కిలోకు రూ.38 చొప్పున చెల్లించామన్నారు. ఇప్పుడు బోనస్ మొత్తం నుంచి కిలోకు అదనంగా రూ.8 చొప్పున చెల్లిస్తామని పీవో పేర్కొన్నారు.

సోకిలేరు వాగులో పుష్ప-2



ఎర్రచందనం దుంగల తరలింపు సన్నివేశం

చింతూరు: అల్లు అర్జున్ హీరోగా నటిస్తున్న పుష్ప-2 చిత్రంలోని కొన్ని సన్నివేశాలను మండలంలోని తులసిపాక అటవీప్రాంతంలో యూనిట్ సభ్యులు చిత్రీకరించారు. చింతూరు, మారేడుమిల్లి రహదారి పక్కనఉన్న సోకిలేరు వాగులో ఎర్రచందనం దుంగలను లారీలపై స్మగ్లింగ్ చేసే దృశ్యాలను చిత్రీకరించారు. ఈ షూటింగ్‌ను తిలకించేందుకు సమీప గ్రామాల ప్రజలు అధికసంఖ్యలో తరలివచ్చారు.

మనస్సాక్షితో పనిచేస్తే మంచి ఫలితాలు



చింతూరులో నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న ప్రవీణ్‌ప్రకాష్



కూనవరం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులతో కలిసి ఫొటో దిగిన ప్రవీణ్ ప్రకాశ్, పీవో సూరజ్ గనోరే

- ఏపీ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్
- నిఘంటువులు అందజేయకపోవడంపై మండిపాటు
- రెండు నెలలు విద్యార్థులకు మ్యాథ్స్ బోధించాలని ఎంఈవోకి ఆదేశం



గుల్లేటివాడ గ్రామంలో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ప్రవీణ్‌ప్రకాష్

కూనవరం : మనస్సాక్షితో పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని ఏపీ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ అన్నారు. స్థానిక జిల్లాపరిషత్ హైస్కూల్‌ను శనివారం ఆయన సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలు తెరిచిన మొదటి రోజే విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు అందాయా లేదా అని ఆరా తీశారు. 10వ తరగతి విద్యార్థులకు నిఘంటువులు అందక పోవడంతో మండిపడ్డారు. గత ఏడాది వచ్చిన గోదావరి వరదలలో పుస్తకాలు, నిఘంటువులు తడిపోయినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వెంటనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగానే రూ.1.7 లక్షలు మంజూరు చేశారన్నారు. ఇక్కడి విద్యార్థులకు ఇప్పటి వరకు వాటిని అందజేయకపోవడం ఏమిటని ఎంఈవోను ప్రశ్నించారు. ప్రతీ తరగతి గదులను సందర్శించారు. జగనన్న విద్యాకానుక కిట్లు అందాయా లేదా అనేది తెలుసుకున్నారు. తపడ వ తరగతి విద్యార్థులకు ఇవ్వాల్సిన స్కూల్ బ్యాగులకు బదులు టెన్ విద్యార్థుల లాంగ్ బ్యాగులు పంపిణీకి తేవడంపై ఏ తరగతికి ఏసైజ్ బ్యాగ్‌లు ఇవ్వాలో తెలియకపోతే ఎలా అని మందలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆయన మాట్లాడారు. ఈనెల 24లోగా జగనన్న విద్యాకానుక మెటీరియల్ పూర్తిగా అందకుంటే తనకు ఫోన్ చేయండని వారికి నంబరు తెలిపారు. ప్రభుత్వం విద్య, వైద్యం పట్ల ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని అన్ని సమకూర్చుతుంటే వాటిని అందజేయడంలో మీకొచ్చిన ఇబ్బంది ఏమిటని అసహనం వ్యక్తం చేశారు. సకాలంలో నిఘంటువులు అందజేయని కారణంగా ఎంఈవోను రెండు నెలలపాటు కూనవరం, మర్రిగూడెం పాఠశాలలో విద్యార్థులకు మ్యాథ్స్ బోధించాలని ఆదేశించారు. చింతూరు ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, ఆర్‌జేడీ జ్యోతి కుమారి, సర్వశిక్షాభియాన్ అధికారులు, తహసీల్దార్ కె.అనసూయ, ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ పాల్గొన్నారు.

త్వరితగతిన నాడు-నేడు పనులు

చింతూరు: నాడు-నేడు కింద పాఠశాలల్లో చేపడుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పాఠశాల ఏపీ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ ఆదేశించారు. శనివారం ఆయన ఐటీడీఏ పీవో సూరజ్ ధనుంజయ్ గనోరేతో కలసి మండలంలోని ఎర్రంపేట కేజీబీవీ పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో నాడు-నేడు రెండో విడతలో నిర్మిస్తున్న అదనపు గదుల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు నాణ్యతతో చేపట్టాలని, త్వరితగతిన పూర్తి చేయడం ద్వారా గదులను విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. భవన నిర్మాణాలు పూర్తయిన వెంటనే విద్యార్థులకు కావాల్సిన మౌళిక సౌకర్యాలను కల్పించాలని ఆయన ఆదేశించారు. అనంతరం ఆయన జగనన్న విద్యాకానుక కిట్లు అందాయా, లేదా అనే విషయాన్ని విద్యార్థినుల నుంచి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న విద్యాకానుక కిట్లను సద్వినియోగం చేసుకుని అందరూ మంచిగా చదువుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు సరఫరా చేసిన కాస్మోటిక్స్ నాణ్యతను ప్రవీణ్ ప్రకాష్ పరిశీలించారు. అనంతరం ఆయన చింతూరులోని గిరిజన ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు.

పిల్లలను పంపించకపోతే ఎలా?

వీఆర్‌పురం: పాఠశాలలు పునఃప్రారంభించినప్పటికీ విద్యార్థులను పంపించకపోతే ఎలా? అని ఏపీ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ ప్రశ్నించారు. శనివారం మండలంలోని విలీన మండలాల్లో పర్యటించిన ఆయన సున్నంవారిగూడెం గ్రామంలోని ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించారు.విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటాన్ని గమనించిన ఆయన మెనూ అమలు, పాఠశాలలో సౌకర్యాల వివరాలు తెలుసుకున్నారు. పాఠశాలకు రాని విద్యార్థుల గ్రామాల వివరాలను హెచ్ఎం అబ్బులు నుంచి ఆరా తీశారు. అనంతరం తన వాహనంలో గుల్లేటివాడ గ్రామానికి వెళ్లారు. అక్కడ ఇళ్ల వద్ద ఆడుకుంటున్న విద్యార్థులను ఆయన గమనించారు. పాఠశాలకు ఎందుకు వెళ్లలేదని వారిని, తల్లిదండ్రులను ప్రశ్నించారు. ఎండలు తీవ్రంగా ఉండటంతో పాఠశాలకు తమ పిల్లలను ఇంకా పంపడం లేదని వారు బదులిచ్చారు. విద్యార్థుల భవిష్యత్తు కోసమే ప్రభుత్వం అనేక సౌకర్యాలను పాఠశాలలో కల్పిస్తుందని, పిల్లలను పంపాలని వారికి ఆయన సూచించారు. గ్రామంలోని సుమారు ఐదుగురు విద్యార్థులను మరో వాహనంలో పాఠశాలకు పంపించారు.ఆయన వెంట ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే, తహసీల్దార్ ఎన్.శ్రీధర్, ఎంపీడీవో రత్నకుమారి, ఎంఈవో వీవీ.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

20న మెగా జాబ్ మేళా

- సద్వినియోగం చేసుకోవాలి
- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తదితరులు

సాక్షి,పాడేరు: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఈనెల 20వతేదీన పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించే మెగా జాబ్ మేళాను నిరుద్యోగ అభ్యర్థులంతా సద్వినియోగం చేసుకోవాలని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి కోరారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో జాబ్‌మేళాకు సంబంధించిన ప్రచార పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నవతా రోడ్డు ట్రాన్స్‌పోర్టు, ఫెయిర్ ఫీల్డ్ మారియోట్, అపోలో ఫార్మసీ, కేర్ ఫర్ యూ, మోహన్ స్పిన్టెక్స్ ఇండియా, డెక్కన్ కెమికల్ ప్రైవేట్ లిమిటెడ్, అరబిందో తదితర అనేక సంస్థల్లో ఉద్యోగాలు ఖాళీలు ఉన్నాయన్నారు. లగిశపల్లి సర్పంచ్ లకే పార్వతమ్మ, పాడేరు డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ పీవో గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

Happy Father's Day

ఫాదర్స్‌డే శుభాకాంక్షలు

- Advt Feature

కుటీర పరిశ్రమలతో జీవనోపాధి

- అర్హత కలిగిన నిరుద్యోగులకు రుణాలు
- అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

పెదబయలు: జిల్లాలో ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రామ్(పీఎంఈజీపి) పథకం ద్వారా కుటీర, చిన్న మధ్య తరగతి పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం అర్హులైన అభ్యర్థులకు ఆయన ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండల పరిధిలో 84 మంది దరఖాస్తు చేసుకోగా, శనివారం 25 మందికి ఇంటర్వ్యూలు చేశారు. మిగిలిన వారికి సమాచారం అందించి మరో రోజు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ స్వయం ఉపాధి ప్రాజెక్టుల ఏర్పాటుకు పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం నేరుగా లబ్ధిదారుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని అవకాశం కల్పించిందన్నారు. గ్రామీణ నిరుద్యోగ యువతకు స్థిరమైన ఉపాధి సృష్టిస్తోందని, తద్వారా పట్టణ ప్రాంతాలకు వలస లేకుండా ఉపయోగపడుతుందన్నారు. ఈ పథకం ద్వారా రూ 9.5 లక్షల నుంచి రూ.23.75 లక్షల వరకు రుణం లభిస్తుందని, లబ్ధిదారుడు 5 నుంచి 10 శాతం జమ చేస్తే, మిగిలిన 90 నుంచి 95 శాతం బ్యాంకులు రుణాలు జారీ చేస్తోందన్నారు. 18 ఏళ్లు పైబడిన వారు అర్హులని తెలిపారు. స్వయం ఉపాధి మార్గాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయన్నారు. ఇంటర్వ్యూలకు వచ్చిన అభ్యర్థులు ధ్రువ పత్రాలు , ప్రాజెక్టు రిపోర్టు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమానికి ముందుగా స్థానిక వెలుగు కార్యాలయంలో నూతనంగా నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను పరిశీలించారు. మండల సమాఖ్య ద్వారా చేపడుతున్న ఈ ప్లాంట్ ప్రజలకు తక్కువ ధరతో సురక్షిత నీరు అందించాలని సూచించారు. పంచాయతీ రాజ్ ఏఈ సంజీవరావు, వెలుగు ఏపీఎం వంతాల ఈశ్వరబాబు నాయుడు, ఈవో ఆర్‌డీ నర్సింగరావు, మండల పరిషత్, వెలుగు సిబ్బంది తదితరులున్నారు.

ఉష్ణ తాపం నుంచి ఉపశమనం

సాక్షి,పాడేరు: మండలంలో శనివారం సాయంత్రం కురిసిన వర్షంతో వేసవి తాపం నుంచి ఉపశమనం లభించింది. అధిక ఉష్ణోగ్రత, ఉక్కపోతతో శనివారం ఉదయం నుంచి పాడేరు ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పాడేరులో 39డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నెలకొనడంతో అల్లాడిపోయారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి వాతావరణం ఒక్కసారిగా భారీ వర్షం కురవడంతో చల్లబడింది.

పెదబయలు: మండలంలో శనివారంసాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు తేలిక పాటి వర్షం కురిసింది.

జి.మాడుగుల: మండలంలో పలు గ్రామాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. గ్రామాల్లో వీధులు, రోడ్లు జలమయమయ్యాయి. పాడేరు–జి.మాడుగుల, చింతపల్లి, నుర్మతి–మద్దిగరువు, సొలభం, వంజరి, గెమ్మెలి రోడ్డు మార్గాల్లో ద్విచక్ర వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

హుకుంపేట: మండల కేంద్రంతోపాటు పరిసర గ్రామాల్లో శనివారం భారీ ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. హుకుంపేట వారపు సంతలో గిరిజనులు ఇబ్బందులు పడ్డారు.

డుంబ్రిగుడ: మండల కేంద్రంతోపాటు పరిసర గ్రామాల్లో భారీ వర్షంతో ఎండ వేడిమి నుంచి ప్రజలు ఉపశమనం పొందారు.

నాన్నా నీకు వందనం

- ఎల్లలు లేని తండ్రి ప్రేమ
- నేడు అంతర్జాతీయ పితృ దినోత్సవం



మహారాణిపేట : నాన్న ప్రేమకు ఎల్లలుండవు. పిల్లలకు ఎలాంటి కష్టం తెలియకుండా పెంచి పెద్ద చేసేందుకు తండ్రి కష్టపడతాడు. కుటుంబ అవసరాల కోసం తన సుఖాలను పక్కన పెట్టి శ్రమిస్తాడు. అలాంటి తండ్రిని పితృదేవుడిగా కీర్తిస్తూ ప్రతి ఏటా జూన్ మూడో ఆదివారం ఫాదర్స్‌డే జరుపుకోవడం ఆనవాయితీ. అమెరికాకు చెందిన సోనారా స్మార్ట్ డాడ్ అనే మహిళ కుటుంబం కోసమే ఆలోచించే తండ్రి కోసం ఏదైనా చేయాలని ఆలోచించి నాన్న కోసం తొలుత ప్రచారం మొదలు పెట్టారు. దాని ఫలితంగానే 1910 నుండి ఫాదర్స్‌డే జరుపుకుంటున్నాం.

ఎంతో నేర్చుకున్నాం



మా తండ్రి (ఒమేగా క్యాన్సర్ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బి.రవిశంకర్) నుంచి మేం ఎంతో నేర్చుకున్నాం. వృత్తిలో ఎన్ని వత్తిడిలున్నా మాతో స్నేహితుడిలా ఉంటారు. తరచు పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలకు తీసుకెళుతూ కుటుంబ సభ్యులను ఆహ్లాదపరుస్తూ ఉంటారు. క్రమశిక్షణ, సత్ప్రవర్తన ఆయన దగ్గరే నేర్చుకున్నాం.

–బి.రిషిక్, ఒమేగా ఆస్పత్రి ఎండీ రవిశంకర్ కుమారుడు

విలువలు నేర్పించారు



మా తండ్రి పూర్ణ చంద్రరావు (భూమాత రియల్ ఎస్టేట్ మేనేజింగ్ డైరెక్టర్)నాకు విలువలు నేర్పించారు. ఇంట్లో ఎప్పుడూ సరదాగా ఉంటారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని పేదలకు వైద్య సేవలు అందిస్తాను. మా తండ్రి ఆశయాలు నెరవేరుస్తాను.

– డా.తాళ్లూరి ప్రశాంత్, భూమాత రియల్ ఎస్టేట్ ఎండీ కుమారుడు

సేవాదృక్పథం ముఖ్యమని చెబుతారు



నేను ఎంఎస్‌సీ కంప్యూటర్స్ చేశాను. నా తండ్రి వనకూరు మధుసూదనరెడ్డి సహకారం, ప్రోత్సాహంతో సేంద్రియ ఉత్పత్తుల వ్యాపారం చేస్తున్నాను. మనం ఏం చేసినా సేవాదృక్పథం ముఖ్యం అని ఆయన అంటారు. ఎవరినీ ఇబ్బంది పెట్టకుండా జీవించాలని నాకు చెబుతుంటారు.

– వనకూరు లక్ష్మీతేజ, సత్వ నేచురల్స్

మంచితనానికి మారుపేరు మా తండ్రి



మంచికి, మానవత్వానికి మారుపేరు మా తండ్రి వైశ్యరాజు పాల్గుణరాజు. ఆయన అందరికీ ఆత్మీయ బంధువు. ఆయన వద్ద నుంచి క్రమశిక్షణతో పాటు మరెన్నో మంచి విషయాలు నేర్చుకున్నాను. ఇంకా నేర్చుకుంటాను.

– వైశ్యరాజు భద్రగిరిరాజు

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- డిజిటల్ అసిస్టెంట్‌కు షోకాజ్ నోటీసు

జి.మాడుగుల: మండలంలో పాలమామిడి గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను శనివారం ఎంపీడీవో చంద్రశేఖరరావు తనిఖీ చేశారు. ఈ పాఠశాలలో విద్యార్థులకు సంబంధించిన జగనన్న విద్యా కానుక కిట్‌లు, మధ్యాహన భోజన పథకం నిర్వహణను ఆయన పరిశీలించారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలని అంగన్‌వాడీ టీచర్‌ను ఆయన ఆదేశించారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని ఆయన సందర్శించారు. డిజిటల్ అసిస్టెంట్ రెండు రోజుల నుంచి విధులకు గైర్హాజరైనట్టు గుర్తించారు. డిజిటల్ అసిస్టెంట్‌కు షోకాజ్ నోటీస్ జారీ చేసి శాఖాపరమైన చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. ఆయన మాట్లాడుతూ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉపాధ్యాయులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కర్రిముఖిపుట్టు ఘాట్‌లో ఆటో బోల్తా

15 మందికి గాయాలు..నలుగురి పరిస్థితి విషమం



గాయపడిన భాగమతి, గల్లేల కౌశల్య..

ముంచంగిపుట్టు : మండల కేంద్రంలో శనివారం జరిగే వారపు సంతకు వచ్చి తిరుగూ ప్రయాణంలో ప్రయాణికులతో వెళ్తున్న ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న 15 మంది గాయపడ్డారు. గాయపడ్డ వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. వివరాలిలా ఉన్నాయి. కర్రిముఖిపుట్టు పంచాయితీ దాసరిపుట్టు గ్రామానికి చెందిన ఆటో ప్రయాణికులతో ముంచంగిపుట్టు వారపు సంతకు వచ్చి తిరిగి దాసరిపుట్టు వెళ్తూ కర్రిముఖిపుట్టు ఘాట్ వద్దకు వచ్చే సరికి అదుపు తప్పి బోల్తా కొట్టింది. దీంతో ప్రయాణికులంతా రోడ్డుపై పడిపోయారు. వీరిపై ఆటో పడిపోయింది. దీనిని గమనించిన స్థానికులు ఆటోను పైకి లేపి తీవ్రగాయాలైన వారిని ప్రైవేట్ వాహనంలో హుటాహుటిన ముంచంగిపుట్టు సీహెచ్‌సీకి తరలించారు. క్షతగాత్రులకు వైద్యాధికారులు, సిబ్బంది వైద్య సేవలు అందించారు. ఆటో ప్రమాదంలో కర్రిముఖిపుట్టు పంచాయతీ తాంగుల గ్రామానికి చెందిన గల్లేల రామన్న, గల్లేల కౌశల్య, తలాబు భాగమతి, దాసరిపుట్టు గ్రామానికి చెందిన కిల్లో దమ్మోలకు కాళ్లు, చేతులు, తల, మెడ భాగాల్లో తీవ్రగాయాలయ్యాయి. నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. వీరితో పాటు తాంగుల, దాసరిపుట్టు గ్రామాలకు చెందిన వంతాల అనుసు, వనుగు ఈశ్వరమ్మ, వనుగు వెంకటరావు, గుంటా రాజేశ్వరి, కొర్రా నాగమ్మలతో పాటు మారో ఆరుగురు గాయపడ్డారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ రవీంద్ర సీహెచ్‌సీకి వచ్చి క్షతగాత్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తా... ఇద్దరు పోలీసులకు గాయాలు

హుకుంపేట : ఆటో బోల్తా పడిన ప్రమాదంలో ఇద్దరు పోలీసులకు తీవ్ర గాయలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం హుకుంపేట వారపు సంతకు బాకురు నుంచి వస్తున్న ఆటో ప్రమాదవశాత్తూ రామచంద్రపురం గ్రామ సమీపంలోని మలుపు వద్ద బోల్తా కొట్టి గోతిలో పడింది. ఈ ప్రమాదంలో హుకుంపేట పోలీసు స్టేషన్‌కు చెందిన హోమ్ గార్డు కె.రాముకు కాలు విరిగిపోగా, హెడ్ కానిస్టేబుల్ జలంధర్‌కు తీవ్ర గాయలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన తోటి ప్రయణికులు 108కు సమాచారం అందించి క్షతగాత్రులను పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆటో ప్రయణించే బాకురు గ్రామానికి చెందిన ఓ మహిళకు స్వల్ప గాయలయ్యాయని తోటి ప్రయాణికులు తెలిపారు.

గెడ్డలో స్నానానికి దిగి గిరిజన యువతి మృతి

- మరొకరి పరిస్థితి విషమం
- కేజీహెచ్‌కు తరలింపు

సాక్షి, పాడేరు : వంతాడపల్లి పంచాయతీ, కోట్లగరువు గ్రామానికి చెందిన నలుగురు గిరిజన యువతులు గెడ్డలో స్నానానికి వెళ్లారు. వారిలో ఇద్దరు యువతులు ప్రమాదవశాత్తూ గెడ్డలో మునిగిపోయిన ఘటనలో ఒకరు మృతిచెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. శనివారం మధ్యాహ్నం కోట్లగరువు గ్రామానికి శివారున వీసమామిడి కొండదిగువన ఉన్న చెక్‌డ్యామ్ గెడ్డకు బడ్నాయిని శైలజ (19), సివేరి మౌనిక(15) బట్టలు ఉతికేందుకు వెళ్లారు. బట్టలు ఉతికిన తరువాత ఎండ తీవ్రంగా ఉండడంతో గెడ్డలో స్నానానికి దిగారు. వారు లోతుగా ఉన్న ప్రాంతానికి వెళ్లడంతో ఒక్కసారిగా మునిగిపోయారు. శైలజ పూర్తిగా మునిగిపోగా, మౌనిక గెడ్డ నుంచి బయటకు వచ్చి పెద్దగా కేకలు వేసి అపస్మారక స్థితికి చేరుకుంది. సమీపంలో ఉన్న పశువుల కాపర్లు, ఇతర గ్రామస్తులు పరుగున గెడ్డ ప్రాంతానికి చేరుకుని శైలజను కూడా బయటకు తీశారు. కొన ఊపిరితో ఉన్న శైలజను, అపస్మారక స్థితిలో ఉన్న మౌనికను అక్కడ నుంచి ఎత్తుకుని వచ్చి హుటాహుటిన పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యసేవలు కల్పిస్తున్న సమయంలో శైలజ మృతి చెందింది. పరిస్థితి విషమంగా ఉన్న మౌనికను కేజీహెచ్‌కు తరలించి, అక్కడ మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారు. మృతురాలు శైలజకు గత ఏడాది డి.గొందూరు గ్రామానికి చెందిన మహేష్‌తో వివాహం జరిగింది. ప్రస్తుతం కన్నవారి ఇంటి వద్ద ఉన్న సమయంలో ఈ ప్రమాదం జరిగి ఆమె మృతిచెందింది. ఈ దుర్ఘటనతో కోట్లగరువు గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి. ఎస్‌ఐ రంజీత్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శైలజ మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రి మార్చ్యురీలో భద్రపరిచారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి

రాజవొమ్మంగి : రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండలంలోని అమీనాబాద్‌కాలనీకు చెందిన యువకుడు మేలేటి దుర్గాప్రసాద్ (24) కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం మరణించాడు. జడ్డంగి ఎస్ షరీఫ్ తెలిపిన వివరాలివి. జడ్డంగి–చెరకుంపాలెం మధ్య ఈ నెల 13వ తేదీన ట్రాక్టర్, మోటారు బైక్ ఢీ కొటన్న ఘటనలో అమీనాబాద్‌కాలనీకు చెందిన తండ్రి కొడుకులు మేలేటి సీతారాంబాబు (44), దుర్గాప్రసాద్ (24) గాయాలపాలైన సంగతి తెలిసిందే. స్థానికులు వారిని ఆటోలో జడ్డంగి పీహెచ్‌సీకు తరలించారు.

వైద్యులు ప్రథమ చికిత్స అందజేసి కాకినాడ జీజీహెచ్‌కు రిఫర్ చేశారు. ఈ ప్రమాదంలో దుర్గాప్రసాద్‌కు తలకు బలమైన గాయాలయ్యాయి. సీతారాంబాబుకు కుడికాలు, కుడివైపు పక్కటెముకలు విరిగిపోయాయి. కాగా దుర్గాప్రసాద్ పరిస్థితి విషమించి చనిపోయాడు.

చింతపల్లిలో డ్రైవింగ్ లైసెన్స్ పరీక్ష



అదనపు ఎస్పీ ప్రతాప్‌శివకిశోర్

చింతపల్లి: మండల కేంద్రంలో ఈ నెల 19 నుంచి 26వ తేదీ వరకు సేతు కార్యక్రమంలో భాగంగా డ్రైవింగ్ లైసెన్స్ ఎల్‌ఎల్‌ఆర్ పరీక్ష నిర్వహించనున్నట్టు చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్‌శివకిశోర్ తెలిపారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, ఆర్‌టీవో అధికారుల సహకారంతో నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని డ్రైవింగ్ లైసెన్స్ లేని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువత, తమ పరిధిలోని గ్రామ సచివాలయంలో స్లాట్‌ను నమోదు చేసుకోవాలని, ఆధార్‌కార్డుకు మొబైల్ నంబర్‌ను అనుసంధానం చేయించుకోవాలని సూచించారు. మొబైల్ నంబర్‌కు స్లాట్ నమోదు సమయంలో తీసుకోని వెళ్లాలన్నారు. 40 సంవత్సరాలు దాటిన వారు తప్పని సరిగా మెడికల్ సర్టిఫికేట్ చేయించుకోవాలని సూచించారు. స్లాట్ నమోదు చేసుకున్న వారికి ఎంపీడీవో కార్యాలయం నందు ఎల్‌ఎల్‌ఆర్ పరీక్ష నిర్వహించనున్నట్టు అదనపు ఎస్పీ ప్రతాప్‌శివకిశోర్ తెలిపారు. వాహనచోదకులు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలన్నారు.

మరిన్ని క్లాసిఫైడ్స్ 9వ పేజిలో